# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 357 | పేజీలు: 5 | వెల: రూ.4/- | సోమవారం 11 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## భారత్ ఎదగకుండా ఏ శక్తీ అడ్డుకోలేదు

**భారత్ ఎదుగుదలను ఓర్వలేక కుట్రలు చేస్తున్నారంటూ రాజ్ నాథ్ సింగ్ ఫైర్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)**

భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత వస్తువులపై 25 శాతం సుంకం విధించిన నేపథ్యంలో, కొన్ని దేశాలు భారత ఆర్థిక పురోగతిని అసూయతో చూస్తూ, దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. “కొందరు ‘బాస్’లు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న వేగాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మనమే అందరికీ బాస్ అయితే, భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోందని వారు అనుకుంటున్నారు?” అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా, ఉమరియా గ్రామంలో బీఈఎంఎల్ కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ‘ఓట్ చోరీ’ వెబ్‌సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

- ఈసీఐకి వ్యతిరేకంగా ‘ఓట్ చోరీ’ పేరుతో రాహుల్ గాంధీ ప్రచారం
- డిజిటల్ ఓటర్ల జాబితా విడుదల చేయాలని డిమాండ్
- ప్రజల మద్దతు కోసం ప్రత్యేక వెబ్‌సైట్, మిస్డ్ కాల్ నంబర్ విడుదల
- సోమవారం ఈసీఐ కార్యాలయానికి ఇండియా కూటమి ఎంపీల నిరసన ర్యాలీ
- రాహుల్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన ఎన్నికల సంఘం
- ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విందు




**న్యూఢిల్లీ, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు ‘ఓట్ చోరీ’ పేరుతో నేడు ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ ‘ఎక్స్’ వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. “వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం” అని ఆయన పేర్కొన్నారు. “దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని ఆపేందుకు ప్రారంభించిన ఈ ప్రచారానికి మనస్ఫూర్తిగా మద్దతివ్వండి. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం” అని ఆయన అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు, పార్టీలు ఓటర్ల జాబితాను తనిఖీ చేసేందుకు వీలుగా ఈసీఐ పారదర్శకంగా వ్యవహరించి డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచారానికి మద్దతుగా votechori.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు. గత 10 ఏళ్ల

..మిగతా 2లో



## నీటి ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాద్‌లో భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటన
- అమీర్‌పేట్ గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి
- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం సూచన

**హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)**

భాగ్యనగరంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు వాతావరణ శాఖ మరోసారి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా

..మిగతా 2లో


# బంగాళాఖాతంలో అల్పపీడనం

- తెలంగాణలో మరింత తీవ్ర రూపం దాల్చనున్న వర్షాలు
- ఆగస్టు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం
- హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అతి భారీ వర్షాలు

**హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆగస్టు 13 నాటికి అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం ప్రకటించింది. దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు తీవ్రరూపం దాల్చనున్నాయని తెలిపింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఈ విషయంపై స్పందిస్తూ, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఎక్స్ వేదికగా

..మిగతా 2లో



## పుతిన్ మైండ్‌గేమ్..

### అమెరికా గూఢచార సంస్థకు ఇరకాటం!

- అమెరికాకు షాకిచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్
- సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడికి ‘ఆర్డర్ ఆఫ్ లెనిన్’ పతకం
- రష్యా తరఫున ఉక్రెయిన్ యుద్ధంలో మరణించాడని ప్రకటన
- ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్‌కు పతకాన్ని అందజేత
- ఇది పుతిన్ మైండ్‌గేమ్ అని భావిస్తున్న విశ్లేషకులు
- యువకుడికి మానసిక సమస్యలున్నాయని తెలిపిన సీఐఏ

2



## బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- కాషాయ దళంలో చేరిన గువ్వల బాలరాజు
- హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర చీఫ్
- గువ్వలతో పాటు మరికొందరు నియోజకవర్గ నేతలు కూడా బీజేపీలో చేరిక
- బీఆర్ఎస్‌లో సరైన గుర్తింపు లేదనే అసంతృప్తితో ఉన్న గువ్వల
- ఆయన చేరికతో తమ పార్టీ మరింత బలపడుతుందన్న బీజేపీ నేతలు
- కొద్దిరోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఊహాగానాలకు ముగింపు

2

## సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో కలిసి ప్రధాని మోదీ మెట్రో రైడ్

- బెంగళూరు ఎల్లో లైన్ మెట్రో ప్రారంభోత్సవంలో ఆసక్తికర దృశ్యం
- ప్రధాని మోదీతో సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఆప్యాయ సంభాషణ
- మెట్రోలో ప్రధానికి ఇరువైపులా కూర్చుని ముచ్చటించిన కాంగ్రెస్ నేతలు
- రాజకీయ విమర్శలు పక్కనపెట్టి నవ్వుతూ కనిపించిన నేతలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటోలు, వీడియోలు
- టెక్ హబ్ ఎలక్ట్రానిక్స్ సిటీని కలుపుతూ ఎల్లో లైన్ మెట్రో ప్రారంభం



**బెంగళూరు, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)**

కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తరచూ తీవ్ర విమర్శలు చేసే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు... ఆయనతో ఎంతో ఆప్యాయంగా, నవ్వుతూ మాట్లాడటం విశేషం. బెంగళూరులో జరిగిన మెట్రో ప్రారంభోత్సవ వేడుక ఈ అరుదైన సన్నివేశానికి వేదికైంది. ఆదివారం నాడు బెంగళూరులో ఎల్లో లైన్ మెట్రో సేవల

..మిగతా 2లో





# 'ఓట్ చోరీ' వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి...

ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని ఆగస్టు 8న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈసీఐని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అలా చేయడంలో విఫలమైతే, ఎన్నికల మోసాన్ని ఈసీఐ కప్పిపుచ్చినట్లే అవుతుందని, అది నేరంతో సమానమని ఆయన హెచ్చరించారు. అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం "ఆధారరహితమైనవి"గా కొట్టిపారేసింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా



నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని ఈసీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, రేపు సోమవారం నాడు పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ఇండియా కూటమి ఎంపీలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించడానికి రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారు. ఈసీఐ అధికారులతో సమావేశం కోసం కూటమి నేతలు ఇప్పటికే సమయం కోరినట్లు సమాచారం. అదే రోజు రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఐక్యంగా పోరాడేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి.




# పుతిన్ మైండ్‌గేమ్..

## అమెరికా గూఢచార సంస్థకు ఇరకాటం!

**అమెరికాకు షాకిచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్**

**సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడికి 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకం**

**రష్యా తరఫున ఉక్రెయిన్ యుద్ధంలో మరణించాడని ప్రకటన**

**ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్‌కు పతకాన్ని అందజేత**

**ఇది పుతిన్ మైండ్‌గేమ్ అని భావిస్తున్న విశ్లేషకులు**


**యువకుడికి మానసిక సమస్యలున్నాయని తెలిపిన సీఐఏ**

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)

అంతర్జాతీయ రాజకీయాల్లో తనదైన శైలితో ప్రత్యర్థులకు చుక్కలు చూపే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, తాజాగా అమెరికాను ఇరుకునపెట్టేలా సంచలన ఎత్తుగడ వేశారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్‌నే లక్ష్యంగా చేసుకుని ఆయన ఆడిన మైండ్‌గేమ్‌తో వాషింగ్టన్ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరఫున ప్రత్యేక దూతగా క్రెమ్లిన్‌కు వచ్చిన స్టీవ్ విట్కాఫ్‌తో సమావేశమైన పుతిన్, ఓ అనూహ్య బహుమతిని ఆయన చేతికి అందించి కలకలం రేపారు.

అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ జూలియన్ గల్లినా కుమారుడైన మైఖెల్ గ్లోస్‌కు 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకాన్ని బహూకరిస్తున్నట్లు పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతూ మైఖెల్ వీరమరణం పొందాడని, ఆయన ధైర్యసాహసాలకు గుర్తుగా ఈ పతకాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ పతకాన్ని జూలియన్‌కు చేరవేయాలని విట్కాఫ్‌ను పుతిన్ కోరారు. ఈ చర్యతో అమెరికా గూఢచార వర్గాల్లోనే అనుమానాలు రేకెత్తించాలని, అమెరికాను ఆత్మరక్షణలోకి నెట్టాలని పుతిన్ ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది. ఈ సంఘటన వెనుక పుతిన్ ఉద్దేశం అమెరికా సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడు రష్యా పక్షాన యుద్ధంలో పాల్గొన్నాడనే ప్రశ్నలను లేవనెత్తడమేనని నిపుణులు అనుమానిస్తున్నారు మైఖెల్ గ్లోస్ గతంలో సోషల్ మీడియాలో రష్యాకు మద్దతుగా పోస్టులు పెట్టాడని, మాస్కోలో ఉన్న చిత్రాలు కూడా బయటకు వచ్చాయని సమాచారం. అతడు 2024 ఏప్రిల్‌లో తూర్పు ఐరోపాలో మరణించినట్లు వార్తలొచ్చాయి. మైఖెల్ మృతదేహం అమెరికాకు చేరిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో సీఐఏ ఓ ప్రకటన విడుదల చేసింది. మైఖెల్ మరణానికి, జాతీయ భద్రతకు ఎలాంటి సంబంధం లేదని, అతడు కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని ఆ ప్రకటనలో పేర్కొంది.

పుతిన్ ఇచ్చిన పతకాన్ని విట్కాఫ్ స్వీకరించారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై అటు రష్యా గానీ, ఇటు అమెరికా, సీఐఏ లేదా విట్కాఫ్ వర్గాలు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. కేవలం అమెరికాను రెచ్చగొట్టేందుకే పుతిన్ ఈ చర్యకు పాల్పడ్డారని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలోని హెలిప్యాడ్‌లో దిగిన తెలంగాణ మంత్రులు

**వివాహ కార్యక్రమం కోసం మంగళగిరి వచ్చిన తెలంగాణ మంత్రులు**

**జనసేన పార్టీ కార్యాలయం హెలిప్యాడ్‌లో దిగిన హెలికాప్టర్**

**ఉప ముఖ్యమంత్రి భట్టి బృందానికి పవన్ కల్యాణ్ తరఫున స్వాగతం**

**స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ హరిప్రసాద్**

**తిరుగు ప్రయాణంలో మంత్రులకు కొండపల్లి బొమ్మలు బహూకరించిన జనసేన నేతలు**

**భట్టితో పాటు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి తదితరుల హాజరు**

మంగళగిరి, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి అద్దం పట్టే ఆసక్తికర పరిణామం ఆదివారం మంగళగిరిలో చోటుచేసుకుంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో మంగళగిరి వచ్చారు. వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ నేరుగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి ఉన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరఫున శాసనమండలిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, ఇతర జనసేన నాయకులు తెలంగాణ మంత్రులకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారంతా మంగళగిరిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తెలంగాణ మంత్రులు తిరుగు ప్రయాణమయ్యేందుకు తిరిగి జనసేన కార్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా వారితో కలిశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా పంపిన, తెలుగు సంస్కృతికి ప్రతీకలైన కొండపల్లి బొమ్మల జ్ఞాపికలను తెలంగాణ మంత్రులకు బహూకరించి జనసేన నాయకులు వీడ్కోలు పలికారు.



# నీటి ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

రంగంలోకి దిగి, హైదరాబాద్‌లోని నీటి ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి అమీర్‌పేట్‌లోని గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌తో పాటు పలు లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. భారీ వర్షాల వల్ల రోడ్లపైకి చేరిన మురుగునీటిని, డ్రైనేజీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద నీటితో తాము పడుతున్న కష్టాలను స్థానికులు ముఖ్యమంత్రికి వివరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న రేవంత్ రెడ్డి, వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

పర్యటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హైదరాబాద్ కమిషనర్‌ను, సిబ్బందిని ఆదేశించారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు.



# సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో కలిసి ప్రధాని మోదీ మెట్రో రైడ్

మొదటి పేజీ తరువాయి...

ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌వీ రోడ్ మెట్రో స్టేషన్‌లో ప్రధానికి స్వాగతం పలికిన సీఎం సిద్ధరామయ్య.. పుష్పగుచ్ఛం అందిస్తూ ఆయన చేతిని పట్టుకుని ఆప్యాయంగా పలకరించారు. ఇక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అయితే, ప్రాజెక్టు వివరాలను ప్రధానికి ఎంతో ఉత్సాహంగా వివరించారు. కార్యక్రమం పూర్తయ్యాక ముగ్గురు నేతలు కలిసి కొత్త మెట్రో రైలులో ప్రయాణించారు. ఆర్‌వీ రోడ్ స్టేషన్ నుంచి బొమ్మనహల్లి వరకు సాగిన 19.15 కిలోమీటర్ల ఈ ప్రయాణంలో ప్రధాని మోదీకి ఇరువైపులా సిద్ధరామయ్య, శివకుమార్‌లు కూర్చున్నారు. ప్రయాణమంతా ముగ్గురూ ఎంతో సరదాగా ముచ్చటించుకున్నారు. డీకే శివకుమార్ మెట్రో రైలు నుంచి బయటకు చూపిస్తూ ప్రధానికి పలు విషయాలు వివరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. నేతల మధ్య నవ్వులు విరిశాయి. రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి వారు ఇలా కలిసిపోయి ముచ్చటించుకోవడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి.

ఈ కార్యక్రమానికి ముందు ప్రధాని మోదీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టికెట్ కొనుగోలు చేశారు. అనంతరం ఎల్లో లైన్ మెట్రో సేవలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గం బెంగళూరు సెంట్రల్ డిస్ట్రిక్ట్‌ను టెక్ హబ్ అయిన ఎలక్ట్రానిక్స్ సిటీతో కలుపుతుంది. ప్రధానితో పాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థినులు, 8 మంది చిన్నారులు, 8 మంది మెట్రో కార్మికులకు ఈ రైలులో ప్రయాణించే అవకాశం దక్కింది. ప్రయాణంలో వారితో కూడా ప్రధాని ముచ్చటించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. భారీ వర్షాల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని కార్యాలయాలు ఆగస్టు 13, 14 తేదీల్లో పనివేళల్లో మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు, ఆగస్టు 13న ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అదే రోజు హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడనున్నాయి. ఆగస్టు 14న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, నల్గొండ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఇప్పటికే హైదరాబాద్ సహా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం తర్వాత, ఆదివారం కూడా వర్షాలు కొనసాగాయి. దీంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరవాసులను హెచ్చరించారు. అనవసరంగా బయటకు రావద్దని, ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. గంటకు 10 సెం.మీ.కు పైగా వర్షం కురుస్తుండటంతో నగరాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని అర్వింద్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో వర్షపాతం సాధారణంగానే ఉందని, హైదరాబాద్ సహా ఎనిమిది జిల్లాల్లో అధిక వర్షపాతం, ఏడు జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని ఆయన వివరించారు.

# బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే ఉదయం)

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఆదివారం నాడు హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బాలరాజుకు కాషాయ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గువ్వలతో పాటు ఆయన అనుచరులు, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కూడా బీజేపీ సభ్యత్వం స్వీకరించారు.

కొన్ని రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి గువ్వల బాలరాజు ఏ పార్టీలో చేరతారనే దానిపై తీవ్రమైన చర్చ నడిచింది. గతంలో తనపై దాడి జరిగినప్పుడు పార్టీ నాయకత్వం అండగా నిలవలేదని, తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన బీఆర్ఎస్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీని వీడగా, తాజాగా బీజేపీలో చేరడంతో ఊహాగానాలకు తెరపడింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి గువ్వల బాలరాజు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆయన సేవలను పూర్తిగా వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులు పాల్గొని గువ్వల బాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

# నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం పనిచేసినప్పుడు గుర్తింపు

బుద్వేల్, ఆగస్టు 10(నమస్తే ఉదయం) పార్టీ కోసం పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుం దని బీజేపీ మైలార్దేవుపల్లి డివిజన్ - 2 అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు. ఆదివారం మైలార్ద్దేవుపల్లి డివిజన్- 2 బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం మైలార్ద్దేవుపల్లి లో జరిగింది. బీజేపీ బలం కార్యర్తలన్నారు. పార్టీలో కార్యకర్తలకు, నాయకులకు ఏ బాధ్యత ఇచ్చిన ఆ బాధ్యతను పట్టుదలతో నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరు జెండా కోసం పనిచేయాలన్నారు. కార్పొరేటర్ స్థాయి నుంచి బండి సంజయ్ నేడు కేంద్ర మంత్రిగా, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా ఎదిగారన్నారు. యువమోర్చా కార్యకర్త నుంచి బెంగుళూరు కు చెందిన తేజస్వీ సూర్య ఎంపీగా, యువమోర్చా జాతీయ అధ్యక్షునిగా ఎదిగారన్నారు. పార్టీ కోసం పనిచేయాలని, వ్యక్తుల కోసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జోగి రవి, ఆడికె రాజు, రావుల భాస్కర్, నవారు మురళీధర్రెడ్డి, బొమ్మరాజు నర్సింహ్మా, వెంకటరమణ గుప్తా, బల్ల శ్రీనివాస్ యాదవ్. గూడురు అంజీ, జె వినయ్ కుమార్, జేఎం శ్రీను, జె నగేశ్, భాస్కర్, శరణ్, నిఖిల్, అరుణ్, హర, శశిరెడ్డి, సందీప్. సాయి తదితరులు పాల్గొన్నారు.



మైలార్ దేవుపల్లిలో సమావేశమైన బీజేపీ నాయకులు



శివరాంపల్లి రోడ్డులో ఉన్న దేవాలయం లో స్థానిక నాయకులు

## శివరాంపల్లి ప్రధాన రోడ్డులో ఉన్న దేవాలయానికి ఎలాంటి ప్రమాదాలు జరుగకుండ చర్యలు తీసుకోవాలి

బుద్వేల్, ఆగస్టు 10(నమస్తే ఉదయం): శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 280 వద్ద ఉన్న శ్రీ బంగారు మైసంబాపు దేవాలయంలో నష్టం కలిగించిన వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి బైక్ పై దేవాలయ ప్రాంగణం లోకి వచ్చి హనుమాన్ విగ్రహం, కొంత నిర్మాణ బాగానికి నష్టం కలిగించారని గుర్తు చేశారు. సమాచారాన్ని తెలుసుకున్న స్థానిక నాయకులు మహిపాల్ రెడ్డి, వై.శ్రీధర్, హరికిషన్ జీ, సందీప్ ముదిరాజ్, ఎం.ప్రభాకర్రెడ్డి, ఎస్. రాజశేఖర్ రెడ్డి, ఎస్ సన్నీరెడ్డి, దీపక్, శ్రీను, పి.త్రిభువన్ లు దేవాలయాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయం ప్రాంగణం, పరిసరాలలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి బైక్ పై వచ్చిన వ్యక్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. ఈ దేవాలయంలో ప్రతి రోజు పూజలు జరుగుతాయని, ప్రతి అమవాస్య రోజున అన్నదానం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ చర్యలు తీసుకోవాలన్నారు.

## నేడు 115వ బ్యాచ్ ఫోకార్స్ కోర్సు ప్రారంభం

బుద్వేల్, ఆగస్టు 10(నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) లో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ఫౌండేషన్ కోర్స్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీసెస్ (ఫోకార్స్) 115వ బ్యాచ్ ప్రారంభం అవుతుందని నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్, కోర్సు కో ఆర్డినేటర్ లు డాక్టర్ ఎం. రమేశ్ నాయక్, డాక్టర్ డి దామోదర్ రెడ్డి లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యులు డాక్టర్ చహబిలేంద్ర రౌల్, ఐసీఏఆర్ కు చెందిన డాక్టర్ జోయ్ క్రిష్ణ జెనా, విశ్రాంత మిసెల్ శాస్త్రవేత్త అరుణ్ తివారి లు పాల్గొంటారన్నారు.



ఈ గ్రిల్స్ అవసరమా అంటున్న గుర్రంపల్లి శ్యామల్ రాజ్

## పాతవి తవ్వి కొత్త డివైడర్లు అవసరమా ?

బుద్వేల్, ఆగస్టు 10(నమస్తే ఉదయం): లక్షలాది రూపాయలతో గతంలో రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చైరస్తా నుంచి రాజేంద్రనగర్ మీదుగా హిమాయత్సాగర్ వరకు నిర్మించిన రోడ్డు ఢీవైడర్ను తొలగించి కొత్తగా రోడ్డు డివైడర్లను నిర్మించి గ్రిల్స్ ను ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల ప్రజా ధనం వృదా అవుతుందని బహుజన ముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రంపల్లి శ్యామల్ రాజ్ అన్నారు. ఈ పనుల వల్ల పేద ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉం దదన్నారు. ప్రజల కన్నా కాంట్రాక్టర్లకే ఎక్కువ లాభం అన్నారు.



హైదరాబాద్ (బొల్లారం)లోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన బచ్చన్నపేట విద్యార్థులు

## బచ్చన్నపేట విద్యార్థుల విద్యా యాత్ర

### చరిత్ర, సంస్కృతి, ప్రకృతి మేళవింపు

### బొల్లారం లోని రాష్ట్రపతి నిలయం సందర్శించిన విద్యార్థులు

### విద్యార్థులకు శుభాశీస్సులు తెలిపిన జిల్లా కలెక్టర్

జనగామ, ఆగష్టు 10 (నమస్తే ఉదయం): జిల్లాలోని బచ్చన్నపేట మండలానికి చెందిన ప్రభుత్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి హైదరాబాద్ లోని రాష్ట్రపతి నిలయం, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ, రాష్ట్ర మ్యూజియం, పురావస్తు మ్యూజియం పరిసరాలను సందర్శించి, స్వా అనుభవాన్ని సొంతం చేసుకున్నారు. 2025 జూలై 16న రాష్ట్రపతి నిలయం సందర్శన ప్రొసీడింగ్ రావడం తో అవకాశం ఉన్నట్లు తెలుసుకుని అందులో ఉన్న నెంబర్ కు కాల్ చేసి ఎం.ఝాన్సీ లక్ష్మి కావలసిన తేదీని ఎంపిక చేసుకోవడం జరిగింది. సహచర ఉపాధ్యాయులు రాజు, యాదగిరి, రాజులతో చర్చించి 2025 ఆగస్ట్ 07ని నిర్ణయించారు. స్లాట్ బుకింగ్ అనంతరం ధృవీకరణ వచ్చాక ఏర్పాట్లు మొదలయ్యాయి. పల్లె వెలుగు బస్సు ఛార్జీ, మ్యూజియం, ప్లానిటోరియం టికెట్లతో ఒక్కొక్కరి నుండి 500 రూ పాయలు వసూలు చేయగా, కొంతమంది విద్యార్థుల ఖర్చు ఉపాధ్యాయులే భరించారు. ప్రధాన ఉపాధ్యాయులు (హెచ్ఎం) రిటైర్మెంట్, ఎఫ్ఏ -1 పరీక్షలు, ఆడిటింగ్ వంటి బిజీ షెడ్యూల్ మధ్య కూడా యాత్రా ప్రణాళికను నిలబెట్టారు. ఆగస్ట్ 7 తెల్లవారు జామున వంట వారు ఉప్మా, టమోటో చట్నీ, పులిహోర సిద్ధం చేశారు. మినరల్ వాటర్ క్యాన్లు, పేపర్ ప్లేట్లు, చెత్త సంచులు సిద్ధం చేశారు. ఉదయం 6:30కి బస్సు బయలుదేరి ఘట్కేసర్ ఔటర్ రోడ్డు వద్ద ఇతర ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారు. బొల్లారం గేట్ వద్ద అల్పాహారం అనంతరం రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. రిజిస్ట్రేషన్ సమస్యను వాట్సాప్ ధృవీకరణతో పరిష్కరించారు.

**రాష్ట్రపతి నిలయం సందర్శన**

1860 నాటి హెరిటేజ్ బంగ్లా, దర్బార్ హాల్, ప్రెసిడెంట్ డైనింగ్ రూమ్, చెరియల్ ఆర్ట్తో అలంకరించిన అండర్ గ్రౌండ్ టన్నెల్, రాక్ గార్డెన్, హార్బల్ గార్డెన్, బటర్ఫ్లై గార్డెన్, 160 ఏళ్ల వయస్సు గల "టాకింగ్ ట్రీ" వటవృక్షం, మేజ్ గార్డెన్, చారిత్రక జెండా స్తంభం ప్రతిరూపం, రాతి శిల్పాలు, సాంప్రదాయ బావులు వంటి అనేక ఆకర్షణీయ ప్రదేశాలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. తర్వాత తెలంగాణ అసెంబ్లీని సందర్శించి, హౌస్ సీటింగ్, సెషన్ల నిర్వహణపై ఎస్పి మార్గదర్శనం పొందారు. అనంతరం రాష్ట్ర మ్యూజియం లో ఈజిప్ట్ మమ్మీ, విలువైన పురావస్తు ప్రదర్శనలను చూశారు. సాయంత్రం 7:45కి తిరిగి పాఠశాల పాయింట్ చేరుకున్నారు. ఈ విద్యా యాత్ర విద్యార్థులకు చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రకృతి అందాలు, ప్రభుత్వ వ్యవస్థపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించింది. ఈ విజయ వంతమైన టూర్ విజయవంతం కావడానికి తోడ్పడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సహాయక సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ విద్యార్థులకు ఆదివారం శుభాశీస్సులు తెలిపారు. 2025 సెప్టెంబర్ మాసం వరకు రాష్ట్రపతి నిలయం సందర్శనకు ఆసక్తి ఉన్నవారు 040-29560518 నంబర్కు సంప్రదించి ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి



పెబ్బేర్, ఆగస్టు 10 (నమస్తే ఉదయం) పెబ్బేరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో చల్లనిర్మల -శ్రీ చల్ల శ్రీనివాస్ కుమార్తె లక్ష్మీ ప్రియ వరుడు సాయి కృష్ణ వివాహ వేడుకలు జరిగాయి. ఈ వివాహ వేడుకల్లో సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్ చక్రగిరి వర్ధన్ రెడ్డి, కప్పేట రంగారెడ్డి లు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో పోరాడిన చల్ల శ్రీను అదే వేదికపై సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి,చల్ల శ్రీను అదే వేదికపై రంగారెడ్డి ని గౌరవ సన్మానం చేశారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన సీనియర్ నాయకులు ఎం భీమ్ రెడ్డి

## నూతన వధూవరులు అఖిల, చిరంజీవి రెడ్డి లను ఆశీర్వదించిన నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 (నమస్తే ఉదయం) గద్వాల కె ఎస్ ఫంక్షన్ హాల్ లో వల్లపు రెడ్డి మురళీధర్ రెడ్డి, శ్రీదేవిల రెండవ కుమార్తె అఖిల, చిరంజీవి రెడ్డి ల ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, డి సి ఎఫ్ కట్టా దామోదర్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో రామకృష్ణాపురం గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, కో ఆపరేటివ్ మాజీ డైరెక్టర్ చక్రగిరి వర్ధన్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ జయసింహ రెడ్డి, రాజ శేఖర్ రెడ్డి కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్నా డిఎస్ఎం అధ్యక్షుడు వలిగొండ విజయరాజు

## మతంతో సంబంధం లేకుండా దళితులకు ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలి

### రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలి

### దళిత సాలిడారిటీ మూవ్ మెంట్ (డిఎస్ఎం) అధ్యక్షుడు వలిగొండ విజయరాజు

### ఆగస్టు 10న బ్లాక్ డే పాటించిన డిఎస్ఎం

జనగామ, ఆగస్టు 10 ( నమస్తే ఉదయం): దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛను హరించిన ఆగస్టు 10వ తేదీని బ్లాక్ డే పాటిస్తున్నట్లు దళిత సాలిడారిటీ మూవ్ మెంట్ (డిఎస్ఎం) అధ్యక్షుడు వలిగొండ విజయరాజు అన్నారు. 1950 ఆగస్టు 10 తారీఖున తీసుకు వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా దళిత క్రైస్తవుల హక్కులు కాలరాయ పడ్డాయని, దళితులు మతం మారితే ఎస్సీ రిజర్వేషన్ వర్తించదని చెపుతున్న రాష్ట్రపతి ఉత్తర్వులు అగ్రవర్ణాల కుట్ర అని విజయరాజు ఈ సందర్భంగా మండిపడ్డారు. అప్పటి రాష్ట్రపతి ఉత్తర్వులు దళితుల హక్కులను కాలరాసిందని వెంటనే ఆ ఉత్తర్వును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిఎస్ఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు నిరసన దినంగా పాటించారు. మతంతో సంబంధం లేకుండా దళితులకు ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలమాకుల జితేందర్, జంగా శ్రీకాంత్, జిల్లా నాయకుడు బి.నాగేష్. ఎర్ర ఇస్సాక్, డి.దయాకర్, అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ వర్కాల చందు జన్మదిన వేడుకలు

రాజేంద్రనగర్,ఆగస్టు10 (నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ జర్నలిస్ట్ వర్కాల చందు జన్మదిన వేడుకలు మార్కండేయనగర్ బస్తీలో ఘనంగా నిర్వహించారు.ఆదివారం మార్కండేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి కేకు కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు.శాలువాతో సత్కరించిన మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.భగవంతుడి ఆశీర్వాదంతో నిండు నూరేళ్లు చల్లగా, ఆయురోగ్యాలతో ఉండాలి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వర్కాల చందుకు వెల్ఫేర్ అసోసియేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీడియో రమేష్,యాదగిరి భాస్కర్,చింటూరెడ్డి,ఎస్. మల్లేష్,ఉడుత సురేష్,భూసం నరేష్,రావుల నవీన్, అరుణ్ రెడ్డి,శశి రాజుయాదవ్,రాజు,నవీన్ కుమార్, రవియాదవ్,తదితరులు పాల్గొన్నారు.



మార్కండేయ నగర్ లో సీనియర్ జర్నలిస్ట్ వర్కాల చందు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేయిస్తున్న స్నేహితులు

# పాలకులు సరే... మరీ పరిపాలన అధికారులకు ఏమైంది?

**వర్షానికి పొంగిపొర్లుతున్న వాగులు వంకలు**

**స్తంభిస్తున్న రాకపోకలు**

**వానొచ్చినప్పుడల్లా కోతకు గురవుతున్న నీళ్లహళ్లి వాగు మట్టి రోడ్డు**

**వాగు ఉధృతికి తెగిన తాత్కాలిక రోడ్డు, నిలిచిన రాకపోకలు...**

**వర్షాలకు తెగిపోతున్న వాగు.. నిలిచిపోయిన రాకపోకలు**

**తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డుతో ప్రజల అవస్థలు**

**కాంట్రాక్టర్ అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యమే కారణం**



గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(నమస్తే ఉదయం) పాలకులు ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇస్తుంటారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నా గ్యారెంటీ ఏమి లేదు. పరిపాలన సౌలభ్యం కోసం నూతన జిల్లాలు ఏర్పాటు చేశారు. చిన్న జిల్లాలో ఏ మూలకు ఏ జరిగిన పరిపాలన అధికారులకు క్షణాల్లో తెలిసిపోతుంది. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకపోవలసిన పరిపాలన అధికారులు ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు కనపడుతలేవా? ఇవేమి కనపడుతలేవనుకుంటా? జిల్లాలో వర్షాకాలంలో వర్షాలు వచ్చినప్పుడు అనేక గ్రామాలలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టక రవాణ స్థంబించిపోతుంది. అత్యవసర సమయంలో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టకపోవడంతోనే సమస్య తలెత్తుంది. ఇలా వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నపుడులా కంటి తుడుపుగా చర్యలు చేపడుతున్నారు. కాని శాశ్వత మార్గం చూపెట్టడం లేదు. ఇంకెప్పుడు ప్రజా సమస్యలపై పరిపాలన అధికారులు దృష్టి సారిస్తారు అని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అభివృద్ధి పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**వానొచ్చినప్పుడల్లా కోతకు గురవుతున్న నీళ్లహళ్లి వాగు మట్టి రోడ్డు**

ఉమ్మడి ధరూర్ మండలం నీళ్లహళ్లి పాతపాలెం గ్రామాల మధ్య తాత్కాలికంగా నిర్మించిన మట్టి రోడ్డు బ్రిడ్జీ ఇలా వర్షం వచ్చినప్పుడల్లా వరద నీటికి కొట్టుకపోతునే ఉంటుంది. శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నీళ్లహళ్లి వాగులోకి భారీగా వరధ ఉధృతి పెరగడంతో తాత్కాలిక మట్టి రోడ్డు బ్రిడ్జీ కోతకు గురైంది. గత రెండేండ్లుగా తాత్కాలిక మట్టి రోడ్డు వరద ఉధృతికి అలా...తెగిపోవడం .. ఇలా మట్టితో మరమ్మతులు చేయడం పాలకులకు, పరిపాలన అధికారులకు ఆనవాయితిగా మారింది. ధరూర్ మండలం నీళ్లహళ్లి, పాతపాలెం గ్రామాల మధ్య ఉన్న వాగు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. సమస్య పరిష్కారానికి 2023లో నూతన బ్రిడ్జీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బ్రిడ్జీ నిర్మాణ పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకలకు తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. దీంతో ఉప్పేర్, నెట్టెంపాడు, నీళ్లహళ్లి, పాతపాలెం , వెంకటాపురం గ్రామాల ప్రజలు తాత్కలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పై రాకపోకలు కొనసాగిస్తున్నారు. 2024 కురిసిన భారీ వర్షాలకు నీళ్లహళ్లి వాగు ఉధృత్తంగా ప్రవహించడంతో తాత్కాలిక రోడ్డు కొట్టుకపోయింది. మళ్లీ తాత్కాలికంగా మట్టి రోడ్డును పునఃనిర్మించారు. వర్షం వస్తే చాలు వంతెన తెగిపోవడం పునరావృతం కావడంతో పలు గ్రామాల ప్రజలు పాలకులు, అధికారుల పై తీవ్ర విమర్శలు గుప్పించారు. మూడేండ్లు కావొస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం పాలకులు, అధికారుల పనితీరుకు నిదర్శనం అని మండిపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టినా ఇప్పటివరకు పూర్తి చేయకుండా అట్టి సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడో??**

చుట్టూ ఉన్న ఎనిమిది, పది గ్రామాలకు వెళ్లాలంటే ఆ బ్రిడ్జి(నీళ్లహళ్లి పాతపాలెం గ్రామాల మధ్యన ఉన్న వాగు) మార్గమే దిక్కు. కానీ, వానాకాలం వస్తే మాత్రం ఆ బ్రిడ్జిపై రాకపోకలు సాగించాలంటే ప్రాణాలతో చెలగాటం ఆడినట్టే. ఏళ్ల తరబడిగా వంతెన నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అయితే ఎన్నికల ముందు హడావుడిగా బ్రిడ్జీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడక సాగాయి. నేటికి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాక... తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో గత కొన్నేళ్లుగా వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు నీళ్లహళ్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఉన్న తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కాస్త కొట్టుకుపోయింది. అధికారులు కంటితుడుపు చర్యగా తాత్కాలికంగా మట్టితో దారి చేసి చేతులు దులుపుకుంటున్నారు. అయితే ఈ రహదారి సైతం వాహనాల రాకపోకలతో కొద్ది వరకు దెబ్బతింది. శుక్రవారం, శనివారం కురిసిన భారీ వర్షాలకు మరో సారి తాత్కాలికంగ ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు కోతకు గురైందని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మండలంలోని నీళ్లహళ్లి,నెట్టెంపాడు, ద్యాగదొడ్డి, ఉప్పేర్, పాతపాలెం, ఈర్లబండ తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# బీసీ రిజర్వేషన్‌ల సాధన కోసం ఐక్య పోరాటాలు




గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(నమస్తే ఉదయం)42 బీసీ రిజర్వేషన్ల ను పార్లమెంట్ లో చట్టం చేసి, వెంటనే అమలు చేసేలా, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి రక్షణ కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి లౌకిక శక్తులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆదివారం ధరూర్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టం తెచ్చి అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి బిజెపియేతర రాజకీయ పార్టీలు, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకతాటి పైకి రావాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఆమోదించి పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లు ను చట్టం చేయకుండా చట్ట సభలను సైతం అవమానించిందని విమర్శించారు. నిర్ణీత కాలం లోపు ఎన్నికల నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా బీసీ రిజర్వేషన్ బిల్లును పెండింగ్ లో పెట్టిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బిజెపి నాయకత్వం ముస్లిం రిజర్వేషన్ అంశాన్ని లేవనెత్తుతున్నదని విమర్శించారు. బీసీలకు సంబంధించిన రిజర్వేషన్లు మైనార్టీలు పొందకూడదని అక్రమ పద్ధతుల్లో బిజెపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విమర్శించారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న ద్వంద వైఖరిని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.బీసీలను కేవలం ఓటు బ్యాంకు గా పరిగణిస్తున్న భూస్వామ్య పార్టీలకు, బీసీలు ఐక్యమై ప్రతిఘటన పోరాటాల ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధరూరు మండల కార్యదర్శి దేవదాసు, నాయకులు మేకల నరసింహులు, గోవిందు, మోష, ఆంజనేయులు, లక్ష్మన్న, నరసింహ, ప్రవీణ్,తిమ్మప్ప, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



## జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(నమస్తే ఉదయం) జూరాల జలాశయానికి ఆదివారం వరద ప్రవాహం పోటెత్తింది. గత రెండు రోజులుగా జూరాల ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాలకు తోడు కర్ణాటక జలాశయాల నుంచి భారీగా వరద నీరు విడుదల చేయడంతో ఆదివారం రాత్రి జూరాల జలాశయానికి 88,000 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. నీటిపారుదలశాఖ అధికారులు వరద నీటి నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. 8 గేట్లు ఎత్తివేసి 52,758 క్యూసెక్కులను దిగువకు, విద్యుదుత్పత్తి కేంద్రాలకు 32,399 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. ప్రధాన కుడి కాలువకు 470, కోయిలసాగర్ పథకానికి 315 విడుదల చేస్తున్నారు.

## పిడుగు పడి పదిమందికి స్వల్ప గాయాలు



మల్దకల్,ఆగస్టు10(నమస్తే ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఆదివారం పెద్దొడ్డి గ్రామానికి చెందిన నల్లారెడ్డి వ్యవసాయ పొలంలో చీని పండ్లు తెంపుతుండగా పిడుగు పడి ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.ఐజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన కూలీలు చరణ్ విజయ్,భీమేష్ పొలంలో పండ్లను తెంపుతుండగా సంఘటన చోటు చేసుకుంది. మిగతా ఏడు మంది కూలీలు మల్లయ్య,రఫీ,తిమోతి,రమేష్, లక్ష్మి,శ్రీకాంత్,సుజాతలకు స్వల్ప గాయాలు అయ్యాయి.మల్దకల్ తాసిల్దార్ ఝాన్సీ రాణి,జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్షావలి చారి,నల్లారెడ్డి ఆసుపత్రికి సందర్శించి వారిని పరామర్శించారు.వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో గద్వాల ఏరియా ఆసుపత్రిలో గాయాలైన ముగ్గురికి చికిత్స చేసి పంపించారు.

## జస్ట్ ఒక్క క్లిక్‌తో ఇందిరమ్మ ఇళ్ల స్టేటస్ చెక్

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ, ఆగస్టు 10(నమస్తే ఉదయం):తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులు తమ బిల్లుల స్టేటస్‌ను సులభంగా తెలుసుకోవడానికి ఒక కొత్త ఆన్‌లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇకపై లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే, తమ ఇంటి బిల్లు ఎక్కడి వరకు వచ్చింది, ఏ దశలో ఉంది, లేదా ఏ కారణంతో ఆగిపోయింది వంటి పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని. ఈ స్కీమ్ కింద గుర్తించిన లబ్ధిదారులౌ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నారన్నారు

పనులు ఆధారంగా ప్రభుత్వం కూడా నిధులను జమ చేస్తోందని... ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపు కొనసాగుతోందన్నారు. అయితే చాలా మంది తమ ఖాతాలో డబ్బులు పడ్డాయా లేదా అనేది తెలుసుకోవటానికి ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని... బిల్లుల పేమెంట్ గురించి తెలుసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో...రాష్ట్ర గృహ నిర్మాణశాఖ కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతితో పాటు బిల్లుల పేమెంట్ వివరాలను సులభంగా తెలుసుకునేందుకు వీలుగా వెబ్ సైట్ లో ఆప్షన్లను తీసుకొచ్చిందని.. లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల పురోగతి, బిల్లుల చెల్లింపుల స్టేటస్ చెక్ చేసుకునేలా మాడిఫై చేసిందన్నారు. బిల్లుల పేమెంట్ తో పాటు ఇంటి పురోగతి స్టేటస్ తెలుసుకునేందుకు లబ్ధిదారులు ముందుగా http://indirammaindlu.telangana.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్ళి.... హెూం పేజీలో స్టేటస్ పైకి వెళ్లాలని..ఇక్కడ ఆధార్ నెంబర్ లేదా మొబైల్ నెంబర్ లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ నెంబర్ లేదా అప్లికేషన్ నెంబర్ ను ఎంట్రీ చేసి సబ్మిట్ చేస్తే మీ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు డిస్ ప్లే అవుతాయని... ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఆప్షన్స్ తో లబ్ధిదారులు తరచూ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నేరుగా http://indirammaindlu.telangana.gov.in వెబ్‌సైట్‌లోనే సంబంధిత సేవలను చాలా సులభంగా పొందొచ్చన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి సందేహాలు నివృత్తి చేయడం, ఫిర్యాదుల స్వీకరణ కోసం 040-29390057 టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ ప్రకటన లో తెలిపారు.



కడవెండి గ్రమంలో ఎస్సి కాలనీ లో పోచమ్మ బోనాలతో ఆడపడుచులు

## కడవెండిలో ఘనంగా ఎల్లమ్మ, పోచమ్మ బోనాల పండుగ

జనగామ, ఆగష్టు 10 (నమస్తే ఉదయం): జిల్లా లోని దేవరుప్పుల మండలం కడవెండి గ్రామం లో ఆదివారం సాయంత్రం ఎస్సి కాలనీ లో ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయం లో ఘనంగా బోనాల పండుగను ఎస్సి కులస్థులు జరుపుకున్నారు. ముందుగా ఎల్లమ్మ దేవాలయంలో ఉదయం బోనం చెల్లింపులు, సాయంత్రం డప్పు చప్పుళ్లతో, శివసత్తులతో కాలనీ బోనాలు మొత్తం ఎల్లమ్మ దేవాలయం చుట్టూ ప్రదీక్షణలు చేసి తరువాత పోచమ్మ దేవాలయం లో బోనాలను సమర్పించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో రాఖీ పండుగ మరుసటి రోజున బోనాల పండుగ ను జరుపుకుంటారు. రాఖీ కట్టడానికి తమ ఇంటికి ఆడబిడ్డలు వస్తారని మరుసటి రోజున బోనాల పండుగను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో ఎస్సి కుల పెద్ద మనుసులు భాషిపాక మల్లయ్య, పడమటింటి ఐలయ్య, ఎస్సి కాలనీ ఆడపడుచులు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆగష్టు 13 లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



**జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ అంభికా సోని**

జనగామ, ఆగష్టు 10 (నమస్తే ఉదయం): తమ కొత్త పట్టా పాస్‌బుక్‌లతో ఈనెల 13లోపు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంభికా సోని ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.. 2024-25 సంవత్సరానికి సంబంధించి జూన్ 5 వరకు కొత్త పాస్‌బుక్‌లు పొందిన రైతులు రైతుబీమా పథకం-2025 పాలసీలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఏఈవోలు రైతుబీమా వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపడతారని చెప్పారు.



## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**గద్వాల ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు హెచ్చరిక**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(నమస్తే ఉదయం)మద్యం తాగి రోడ్లపై వాహనాలు నడిపితే ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని గద్వాల ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాలలో ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు, పీఎస్ఐ జహంగీర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని మరోసారి హెచ్చరించారు. రోడ్లపైకి తాగి రావద్దని, తద్వారా ప్రమాదాలకు గురి కాకూడదని ఆయన కోరారు. గద్వాల ట్రాఫిక్ పోలీసులు అన్ని ముఖ్యమైన రహదారుల్లో నిఘా పెట్టారని అన్ని వాహనాలను ఆయా రూట్లలో తనిఖీ చేపడతామని స్పష్టం చేశారు. మద్యం తాగి లైసెన్సులు సీజ్ అయ్యాక ఆరు నెలల్లోపు మళ్లీ వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే ఆరు నెలల జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా పదే పదే పోలీసులకు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే మరింత కఠినతరమైన చట్టం ఉపయోగిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లు, ఆర్.సిలు, హెల్మెట్లు విధిగా తనిఖీల్లో పోలీసులకు చూపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని కోరారు. ప్రజలు ఇప్పటికైనా మద్యం తాగి వాహనాలు నడపడం శ్రేయస్కరం కాదని ఆయన హెచ్చరిస్తున్నారు.



## ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు విడుదల వెయ్యాలి


**బిఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణరెడ్డి**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(నమస్తే ఉదయం) ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించిన యాసంగి సన్న ఒడ్ల కు నేటికీ బోనస్ చెల్లించలేదని బిఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణారెడ్డి అన్నారు . ఆదివారం కేటి దొడ్డి మండలం లోని కొండాపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... యాసంగి సీజన్లో అనేక ఇబ్బందులు పడి సన్నవడ్లు సాగు చేశాం. వాతావరణం అనుకూలించకోవడం, ర్యలంపాడు రిజర్వాయర్ డి9 కాలువ చివరి ఆయకట్టు కు సాగునీరు అందక వారబంది ద్వారా రాత్రి పగలు నిద్ర కాస్తు రహదారుల వెంబడి రాస్తారోకోలు ధర్నాలు తో ఇరిగేషన్, మరియు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ కాలువ వెంబడి పోలీసుల పహారాతో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని పంట పండిస్తే మిల్లర్లు తేమ, తరుగు, తాలు, పేరుతో ధాన్యం దిగుమతి చేసుకునేందుకు తుకంలో కోత విధించి ఇబ్బందులకు గురి చేసిన విధి లేని పరిస్థితుల్లో రైతులు ధాన్యం విక్రయించారు. వడ్లు అమ్మిన డబ్బులతోపాటు బోనస్ డబ్బులు కూడ పడతాయి అనుకున్నాం. కానీ రెండు నెలలు అయినా డబ్బులు రాలేదు. యాసంగి పంట అయిపోయి ఇప్పుడు వర్షాకాలం పంట సాగు చేసే సమయం వచ్చింది. బోనస్ డబ్బులు చెల్లిస్తే మా పెట్టుబడికి ఉపయోగ పడుతుందన్నారు.

# సెల్‌ఫోన్లలో లీనమవుతున్న చిన్నారులు

## కంటిచూపు, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్న వైద్యులు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి , ఆగస్టు 10 (నమస్తే ఉదయం): ఏడాది నిండని పిల్లల చేతికి సెల్‌ఫోన్లు ఇచ్చేయడం.. మా పాప సెల్‌ఫోన్ లేనిదే అన్నం తినదండీ అని చెప్పుకోవడం సర్వసాధారణమైంది. సమయం దొరికినప్పుడల్లా స్మార్ట్‌ఫోన్లలో వీడియోగేమ్స్ ఆడుతున్నారు. చిన్నతనం నుంచే ఇదో వ్యసనంగా మారుతున్నది. వయసుపెరిగే కొద్ది కంటి చూపు మందగించడంతో పాటు ఆరోగ్య, మానసిక సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



### అదుపులో పెట్టకుంటే అనర్థాలే..

రోజు రోజుకూ అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజానంతో పనులు సులువుగా చక్కబెట్టుకుంటున్నాం. అయితే ఈ ఆధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ఎంత ముఖ్యమో.. దానిని అదుపులో పెట్టుకోవడం అంతే అవసరం. ముఖ్యంగా పిల్లల విషయంలో వీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనర్థాలు కొనితెచ్చుకున్నట్లే అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గతంలో క్రికెట్, వాలీబాల్‌లాంటి క్రీడల ద్వారా శారీరక శక్తిని పెంచుకునేవారు. దీంతో వారి ఆరోగ్యం బాగుండేది. మారిన సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ ఫోన్లు, టీవీలు, ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్లు తప్పనిసరి అయింది. దీనికి తోడు పిల్లలను బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడకపోవడంతో వారంతా ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లకు పరిమితమవుతున్నారు.

### తల్లి దండ్రుల గారాబం

పిల్లలు సెల్‌ఫోన్, కంప్యూటర్లతో గంటల కొద్ది గడపడాన్ని తల్లిదండ్రులు గొప్ప విషయంగా భావిస్తున్నారు. వారు కూర్చున్న చోటకే అన్నం, పాలు, పండ్లు తదితర వాటిని అందజేస్తున్నారు. ఇక చిన్న పిల్లలు ఏడిస్తే వారికి సెల్‌ఫోన్ ఇచ్చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల వారి జీవితంపై చెడు ప్రభావం పడుతుందని, నేడు 10 ఏళ్లలోపు పిల్లలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు తీసుకురాకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు తప్పవని

### స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించాలి:
### డాక్టర్ శ్రీనివాస్(ఎండీ ఫిజిషియన్).



చిన్న పిల్లలు, పెద్దలు స్మార్ట్‌ఫోన్‌ను అధికంగా వాడుతున్నారు. దీనివల్ల కంటిచూపుపై తీవప్రభావం పడుతుంది. దగ్గర చూపు కనబడుతుంది. దూరంచుపు సన్నగిల్లుతుంది. తల నొప్పి వస్తుంది. కండ్లనుంచి నీరు కారడం ఎక్కువ అవుతుంది. దీంతోపాటు వివిధ సమస్యలు వస్తాయి. చిన్న వయసులో పెద్ద కండ్లద్దాలు పెట్టుకోవాల్సి వస్తుంది. స్మార్ట్‌ఫోన్ వాడకం తగ్గించకుంటే తిప్పలు తప్పవు. పిల్లలు సెల్‌ఫోన్ల గేమ్స్‌కు దూరంగా ఉంచాలి. అవుట్‌డోర్ గేమ్‌లు ఆడుకునేలా చూడాలని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.




తరచూ చెబుతున్నారు. దృష్టి లోపం ఉన్న వారిని సైనిక ఉద్యోగాల్లో తీసుకోని విషయం తెలిసిందే. మనకు తెలియకుండానే ఉపాధి అవకాశాలకు గండి పడే ప్రమాదముంది.

### చదువుపై ఆసక్తి తగ్గే ప్రమాదం..

పిల్లలు వీడియో గేమ్స్ ఆడే సమయంలో శరీరంలో అడిషనల్ హార్మోన్స్ ఎక్కువగా విడుదలవుతుంటాయి. ఇలా మోతాదుకు మించి విడుదల కావడం శరీరానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. వీడియో గేమ్స్ ఆడడంపై ఆసక్తి పెరిగితే పిల్లలు చదువుపై శ్రద్ధ చూపరు. ఇలాంటి వాటిని దృష్టిలో ఉంచుకొని పిల్లలు పరిమిత సమయం కన్నా.. ఎక్కువ సేపు స్మార్ట్‌ఫోన్లతో ఆడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సబితా రెడ్డి, కె ఎల్ ఆర్





వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(నమస్తే ఉదయం) రంగారెడ్డి జిల్లాలో ఆదివారం రోజున ఫంక్షన్ హాల్ అన్ని వివాహ వేడుకలతో కిటకిటలాడాయి. వివాహ వేడుకలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయా నియోజకవర్గాల టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి ఆయా పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు వివాహ వేడుకల్లో పాల్గొనడానికి ఉరుకులు పరుగులు పెట్టారు.

మహేశ్వర నియోజకవర్గంలో భారీగా జరిగిన పెళ్లిళ్లు పాల్గొన్న పార్టీ నాయకులు. మహేశ్వరం నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్.. పేదలకు వరం

## మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



వైద్య చికిత్స కోసం
ఎల్‌ఓసి అందజేస్తున్న కేఎల్‌ఆర్



వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ పత్రం అందజేస్తున్న కేఎల్‌ఆర్

మహేశ్వరం, ఆగస్టు 10(నమస్తే ఉదయం): సీఎం రిలీఫ్ ఫండ్ ఆరోగ్య సమయంలో నిరుపేద ప్రజలకు ఒక వరం లాంటిదని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యపరంగా క్షేమంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వెల్లడించారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 45 మంది లబ్ధిదారులకు ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... ఆర్థికంగా వెనుకబడిన ప్రజలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం సామాన్య ప్రజలకు నాణ్యతమైన వైద్య సేవలు అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ చేయూతనిస్తుందని వెల్లడించారు. చికిత్స అయ్యే ఖర్చులకు రూ. 10 లక్షలకు పెంచింది అని తెలిపారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్న పేదలు అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశ్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహిళా, యూత్ వింగ్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బొమ్మ బొరుసు స్థావరంపై
# పోలీసుల మెరుపు దాడులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 ( నమస్తే ఉదయం)గద్వాల మండల పరిధిలోని పూడూరు శివారులో బొమ్మ బొరుసు (చిత్తు బొత్తు పైసల ఆటలు) ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు ఆదివారం గద్వాల రూరల్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడులో 8 మంది నిందితులను అరెస్టు చేశారు. మరో 13మంది పరారైనట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. నిందితుల నుంచి రూ.7,100నగదు, 21 బైక్ లు, 7 సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల మండల పరిధిలో గత కొంత కాలంగా గుట్టు చప్పుడు చిత్తుబొత్తు పైసల్ ఆట కొనసాగుతోందని విశ్వసనీయ సమాచారం. ఈ చిత్తు బొత్తు పైసల ఆట లో చాలా మంది జీవితాలు నాశనం అవుతున్నా ఈ ఆటలపై ఇప్పటివరకు ఎలాంటి నిఘా లేకపోగా, కనీస చర్యలు లేకపోవడంతో ఈ పైసల ఆట గత కొంతకాలంగా జోరుగా కొనసాగిందని స్థానికులు ఆరోపించారు. చిత్తు బొత్తు పైసల ఆట స్థావరాలపై పోలీసులు నిఘా పెట్టి గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోండి



కేటిదొడ్డి, ఆగస్టు10 (నమస్తే ఉదయం) కొత్తగా రిజిస్ట్రేషన్ భూములను కొనుగోలు చేసి పాసుబుక్కులు వచ్చినవారు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కేటిదొడ్డి మండల వ్యవసాయ అధికారి రాజవర్దన్ రెడ్డి ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 5 వరకు కొత్తగా పట్టాదారు పాస్ బుక్ వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చివరి తేది 13 ఆగస్ట్, 2025 లోపు దరఖాస్తు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు..

1. దరఖాస్తు ఫారం,
2. రైతు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్
3. రైతు ఆధార్ కార్డు జిరాక్స్
4. నామిని ఆధార్ కార్డు జిరాక్స్

పత్రాలను సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 14 ఆగస్టు 1966 నుండి 14 ఆగస్టు 2007 మధ్యలో పుట్టిన ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే భీమా చేసుకోవాలన్నారు. ఇంతకు ముందు బీమా చేసుకొని ఏమైనా మార్పులు చేసుకోవాల్సిన వారు 12 ఆగస్టు వరకు ఆయా గ్రామాలకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్యలను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.కేటిదొడ్డి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు బీమా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని.. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కొత్తగా పాస్ బుక్కులు పొందిన రైతులు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులకు గానీ.. నేరుగా మండల రైతు వేదిక కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు సకాలంలో అందించి రైతులు సహకరించాలని పేర్కొన్నారు.రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం ఎంతో ప్రయోజనం చేకూరుతుందని. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజవర్దన్ రెడ్డి రైతులకు సూచించారు.



# తైక్వాండో ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు10(నమస్తే ఉదయం) జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శ్రీహరి ఆధ్వర్యంలో ఆదివారం రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు చిన్నారులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరికి, కోచ్ లకు మహిళా కోచ్‌లు రాఖీలు కట్టారు. అనంతరం చిన్నారులకు రాఖీలు కట్టారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733